# గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సహచరీల రాఖీ వేడుకలు

**గజ్వేల్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

'మీ రక్ష - సహచరి' కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో 'రక్షాబంధన్ విత్ సహచరీస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ రవికుమార్, ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది సహచరీలకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం సహచరీలకు స్వీట్లు, బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, సామాజిక సమస్యలపై పోలీసు అధికారులు సహచరీలతో చర్చించారు. మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందించడంలో సహచరీల పాత్ర కీలకమని అధికారులు తెలిపారు. సమాజ భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ పోలీస్-ప్రజల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే 'సహచరి' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జ్యోతి, దివ్య, మనోహర, దివ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.








# కోహీర్ మండలంలో తీవ్ర విషాదం.. రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

**జహీరాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. బడంపేట గ్రామానికి చెందిన బేగరి రాచప్ప (48), ఆయన భార్య పద్మమ్మ (40) జహీరాబాద్ నుంచి బంటారం వైపు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

కోహీర్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సజ్జాపూర్ వైపు నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ (AP 15 Y 0725) డ్రైవర్ సునీల్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ దంపతులు ప్రయాణిస్తున్న ఆటో (TS 15 UN 8273)ను బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో రాచప్ప, పద్మమ్మ తీవ్రంగా గాయపడ్డారు.

స్థానికులు వెంటనే వారిని జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే తన సోదరి, బావ మృతి చెందారని పద్మమ్మ సోదరుడు డాకన్న కోహీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందడంతో బడంపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం

**హైదరాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కంబాల శంకర్ కుటుంబానికి రూ.95 లక్షల బీమా పరిహారం అందింది. గురువారం డీజీపీ సి.వి. ఆనంద్ చేతుల మీదుగా మృతుడి తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. కంబాల శంకర్ (31) మార్చి 28న విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాడపర్తి గ్రామం వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలతో ఎయిమ్స్, అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 31న మృతి చెందారు.

శంకర్ జీతం బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతాలో జమయ్యేది. ప్రమాదం అనంతరం బ్యాంకు ద్వారా బీమా క్లెయిమ్ ప్రక్రియ చేపట్టగా, జీటీఎల్ కింద రూ.15 లక్షలు, గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) కింద రూ.80 లక్షలు కలిపి మొత్తం రూ.95 లక్షల పరిహారం మంజూరైంది.

ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఐజీ వెల్ఫేర్ గజరావు భూపాల్, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎం.వి.ఎస్. సుధాకర్, ఎస్.కె. ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.






# పోలీస్ స్టేషన్లలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- **పోలీసులకు రాఖీలు కట్టిన మహిళా పొదుపు సంఘాల సభ్యులు**

**హైదరాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

వనస్థలిపురం, చైతన్యపురి పోలీస్ స్టేషన్లలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిత్యం ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి వనస్థలిపురానికి చెందిన రాహిణీ సమాఖ్య మహిళా పొదుపు సంఘాల సభ్యులు రాఖీలు కట్టి సోదరబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు మాకు రక్ష.. మేము మీకు రక్ష.. మనమంతా ఈ దేశానికి రక్ష' అంటూ పోలీసులు, మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పోలీసులకు రాఖీలు కట్టేందుకు రావడంతో పోలీసు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. రక్షాబంధన్ సందర్భంగా పోలీసులకు, మహిళలకు మధ్య ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో వనస్థలిపురం, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, మహిళా సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.






# డా. రాజేశ్వరి సాయినాథ్‌కు డీజీపీ సి.వి. ఆనంద్ అభినందనలు

- **కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న భరతనాట్య కళాకారిణి**

**హైదరాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

ప్రముఖ భరతనాట్య కళాకారిణి డా. రాజేశ్వరి సాయినాథ్‌ను తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అభినందించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఆగస్టు 13న అందుకున్న రాజేశ్వరి సాయినాథ్ గురువారం డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భరతనాట్యాన్ని దేశ, విదేశాల్లో విస్తృతంగా ప్రదర్శించిన రాజేశ్వరి సాయినాథ్ అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. భరతనాట్య అకాడమీని నిర్వహిస్తూ వేలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. నృత్య కళ ద్వారా వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆమె కృషి చేస్తున్నారు. మ్యాథమెటిక్స్, డ్యాన్స్‌లో పీహెచ్‌డీలు చేసిన రాజేశ్వరి సాయినాథ్ గత 55 సంవత్సరాలుగా భరతనాట్య ప్రదర్శనలు ఇస్తూ కళ పట్ల తన అంకితభావాన్ని చాటుతున్నారు.






# నల్లగొండ జిల్లా జైలులో భద్రతపై ఎస్పీ సమీక్ష

- **పటిష్ట చర్యలు చేపట్టాలి.. అప్రమత్తతతో విధులు నిర్వహించాలి: ఎస్పీ శరత్‌చంద్ర పవార్**

**నల్లగొండ, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఐపీఎస్ గురువారం జిల్లా జైలును సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి జైలు పరిసరాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, భద్రతా విధానాలను పరిశీలించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జైలు భద్రతకు సంబంధించి పలు సూచనలు చేసిన ఎస్పీ.. జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. భద్రతా పాయింట్ల వద్ద సిబ్బంది విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా క్రమశిక్షణతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోటుపాట్లు గుర్తించిన వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. జైలు భద్రత విషయంలో పోలీసు, జైలు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ సమన్వయంతో పనిచేయడం ద్వారా భద్రతను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సందర్శనలో జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్లకు నోటీసులు.. కారణాలపై స్పష్టత ఏదీ?

- **నోటీసుల గడువు పెంచాలి.. పారదర్శకతకు అధికారులు కట్టుబడి ఉండాలి**
- **నకిరేకల్ సహాయ ఎన్నికల అధికారి విజయకుమార్‌ను కోరిన కాసోజు శంకరాచారి**

**నేరడ, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ పేరుతో నేరడ గ్రామంలో అర్హులైన ఓటర్లకు నోటీసులు జారీ చేస్తూ.. వాటికి స్పష్టమైన కారణాలు వెల్లడించకపోవడం పట్ల బీజేపీ నాయకుడు కాసోజు శంకరాచారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కు విషయంలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గతంలో పలుమార్లు ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్న గ్రామస్థులకు సైతం ఎలాంటి స్పష్టమైన కారణాలు తెలియజేయకుండా నోటీసులు ఇవ్వడం అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను అనవసర ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**నోటీసు ఇస్తే.. కారణం కూడా చెప్పాలి**

ఒక పౌరుడికి ఓటరు జాబితాకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పుడు అందులో నోటీసుకు గల కారణం స్పష్టంగా ఉండాలని శంకరాచారి అన్నారు. పేరు తొలగింపు, చిరునామా మార్పు, వివరాల్లో వ్యత్యాసం లేదా ఇతర ఏదైనా కారణం ఉంటే సంబంధిత ఓటరుకు పూర్తి సమాచారం అందించి, తన వాదనను వినిపించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉద్యోగం, ఉపాధి, చదువుల కోసం హైదరాబాద్, ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో నివసిస్తున్న నేరడ గ్రామానికి చెందిన అనేక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి వారికి నోటీసుల సమాచారం సకాలంలో అందకపోతే తమ ఓటు హక్కును కాపాడుకునే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.


**గడువు పెంచి.. ప్రతి ఓటరుకు అవకాశం కల్పించాలి**


నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించేందుకు, అభ్యంతరాలు తెలియజేసేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోకపోతే దానిని పొడిగించాలని శంకరాచారి కోరారు. ముఖ్యంగా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు స్వగ్రామానికి వచ్చి సంబంధిత అధికారులను సంప్రదించేందుకు తగిన సమయం ఇవ్వాలని సూచించారు.

ఓటర్ల సవరణ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే దాని ప్రభావం నేరుగా ప్రజాస్వామ్య హక్కుపైనే పడుతుందని ఆయన హెచ్చరించారు. ఒక అర్హుడైన పౌరుడి పేరు అన్యాయంగా ఓటరు జాబితా నుంచి తొలగిపోయినా, అతనికి సకాలంలో సమాచారం అందకపోయినా అది సాధారణ పరిపాలనా లోపంగా చూడలేమని అన్నారు.

**అధికారులపై బాధ్యత ఉంది**

ప్రజల ఓటు హక్కుతో ముడిపడిన ప్రక్రియలో అధికారులు తొందరపాటు, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని శంకరాచారి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి, సంబంధిత ఓటర్లకు సమాచారం అందించి, వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై నకిరేకల్ సహాయ ఎన్నికల అధికారి విజయకుమార్‌ను సోషల్ మీడియా వేదికగా శంకరాచారి కోరుతూ.. నేరడలో నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి కారణాలను స్పష్టంగా తెలియజేయడంతో పాటు, తమ వివరాలను సరిచేసుకునేందుకు, అవసరమైన పత్రాలు సమర్పించేందుకు గడువును పెంచాలని విజ్ఞప్తి చేశారు. "ఓటరు జాబితా సవరణ ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రక్రియ కాకూడదు.. అర్హుడైన ప్రతి ఓటరు తన హక్కును కాపాడుకునేలా అధికారులు అవకాశం కల్పించాలి. పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా ప్రజాస్వామ్య ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం సరికాదు" అని శంకరాచారి పేర్కొన్నారు.







# పాదయాత్రను విజయవంతం చేయండి

- **మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపు**

**నిజాంపేట, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**




నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ గ్రామం వరకు డాంబర్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాదయాత్ర ఏర్పాట్లపై గురువారం ఆమె ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.

గత మూడేళ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నిజాంపేట మండలంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపడుతున్న పాదయాత్రకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, పున్న వెంకటస్వామి, కిష్టాగౌడ్, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, గౌస్, వెల్దుర్తి శ్రీకాంత్, భాస్కర్‌రావు, నాయిని లక్ష్మణ్, శివకుమార్, మహేష్, రాజుగౌడ్, మధునాల శ్రీకాంత్‌గౌడ్, సందీప్‌గౌడ్, అసునోద్దిన్, తిరుమల్, కరుణాకర్, తిరుపతిరెడ్డి, రాగులబాబు తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణ, నైపుణ్యాలతోనే ఉన్నత శిఖరాలు

- **విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలి: రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంత్‌రెడ్డి**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బ్యూరో | చేవెళ్ల, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రముఖ వక్త హన్మంత్‌రెడ్డి సూచించారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య వక్త హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.

**డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలి: సీఐ నరేందర్‌రెడ్డి**

ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల సీఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. చెడు సావాసాలు, మాదకద్రవ్యాలు వంటి వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని కోరారు.

కళాశాల ప్రిన్సిపాల్ సి.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కళాశాల లక్ష్యమన్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

ఫ్రెషర్స్ డే సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద, సినీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈలలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## SIR నోటీసులు అందుకున్న వారికి గడువు పెంచాలి

- **సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ నాయకుల డిమాండ్**

**నారాయణపేట, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

SIR ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు పత్రాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువును పెంచాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ నాయకులు హాజీ మల్లంగ్, పేరపల్ల రఫీ డిమాండ్ చేశారు. నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో గురువారం BLOలు సుమారు 1,456 మందికి SIR నోటీసులు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఇచ్చిన గడువు ప్రజలకు పూర్తిగా సరిపోదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి, ఇతర కారణాలతో ముంబై, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో వలస వెళ్లి ఉంటున్న వారు స్వగ్రామానికి వచ్చి అవసరమైన పత్రాలు సమర్పించేందుకు మరింత సమయం అవసరమని అన్నారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం నారాయణపేట మండల తహసీల్దార్ అమరేందర్‌ను కలిసి గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులతో ప్రభుత్వం చర్చించి SIR నోటీసులకు సంబంధించి గడువును పొడిగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## మద్దూరు ప్రభుత్వ కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు వేగంగా సేవలందించాలి: కలెక్టర్ ప్రియాంక**

**నారాయణపేట, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

మద్దూరు మున్సిపాలిటీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆసరా, ఒంటరి మహిళా పింఛన్ల దరఖాస్తులు, ఆస్తిపన్ను వసూళ్లు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, మస్టర్ నిర్వహణ, చెక్‌డ్యామ్‌లు, బుష్ క్లియరెన్స్, ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం బాలికల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు, చదువు, పాఠశాల సౌకర్యాలను పరిశీలించారు. ఆరుగురు ఉపాధ్యాయుల్లో హెచ్‌ఎంతో సహా ముగ్గురు ఒకేసారి సెలవులో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, కేంద్రం నిర్వహణను పరిశీలించారు. టీచర్ అందుబాటులో లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి, కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ మహేష్, ఎంపీడీవో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- **పీఆర్సీ ప్రకటించి డీఏ బకాయిలు మంజూరు చేయాలి: టీజీవో**

**హైదరాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి డిమాండ్ చేశారు. పీఆర్సీ ప్రకటించాలని, డీఏ బకాయిలు మంజూరు చేయాలని, నూతన ఆరోగ్య బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటోందన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీతో పాటు అధికారుల కమిటీ, మంత్రులను పలుమార్లు కలిసి సమస్యలను వివరించినా పరిష్కారం కాలేదని తెలిపారు. TGEJAC రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. TGEJAC సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పీఆర్సీ అమలు, డీఏ బకాయిల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించలేదని, నేటి ధర్నా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అని అన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ధర్నాలో నూతనకంటి వెంకట్, శాంతిశ్రీ, సైదమ్మ, అనిత, రాకేష్, మహేశ్వరి, మసూద్ అలీ, నరేందర్, రోజా, శ్రీనివాస్, మహేష్‌తో పాటు జేఏసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# నారాయణపేటలో బీజేపీ నాయకుల అరెస్టు

- **ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలపై బీజేవైఎం నిరసన**

**నారాయణపేట, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నారాయణపేటలో నిరసన చేపట్టారు. రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా సత్యనారాయణ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులను అరెస్టు చేశారు.

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు మణిశంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2021 నుంచి విద్యార్థులకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మరింత పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



కార్యక్రమంలో బీజేవైఎం మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి చేతన్, మనీ మోడీ, అంజి, అన్వేష్, బాలకృష్ణ, అశోక్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దూరాలు పెరిగినా.. దృఢంగా నిలిచే అన్నాచెల్లెళ్ల బంధం రక్షాబంధన్

- **దారపు పోగుల్లో దాగిన ప్రేమ, నమ్మకం, ఆప్యాయత**

**ఆశ్వి అప్డేట్స్ | ప్రత్యేక కథనం**

కాలం మారుతున్నా.. జీవన విధానాలు మారుతున్నా.. సాంకేతికత మనుషులను ప్రపంచం నలుమూలలకు తీసుకెళ్తున్నా అన్నాచెల్లెళ్ల అనుబంధం మాత్రం చెక్కుచెదరడం లేదు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే రక్షాబంధన్ పండుగ ఈ పవిత్ర బంధానికి ప్రతీకగా నిలుస్తోంది. సోదరి సోదరుడి చేతికి కట్టే రాఖీ కేవలం దారపు పోగులు కాదు.. ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, పరస్పర బాధ్యతలకు గుర్తు.

**చరిత్రతో ముడిపడిన బంధం**

రక్షాబంధన్‌కు సంబంధించి అనేక పౌరాణిక, చారిత్రక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. మహాభారతంలోని కథనం ప్రకారం శ్రీకృష్ణుడి చేతికి గాయం అయినప్పుడు ద్రౌపది తన వస్త్రంలోని కొంత భాగాన్ని చించి కట్టింది. ఆమె చూపిన ఆప్యాయతకు ప్రతిగా శ్రీకృష్ణుడు ఆమెకు అండగా నిలిచాడని చెబుతారు. ఇదే రక్షాబంధన్‌లోని రక్షణ, నమ్మకానికి ప్రతీకగా భావిస్తారు.

చరిత్రలో రాణి కర్ణావతి-హుమాయూన్‌కు సంబంధించిన రాఖీ కథనం కూడా ప్రాచుర్యంలో ఉంది. అయితే ఈ ఘటనపై చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు 1905లో బెంగాల్ విభజన సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాఖీని సామాజిక ఐక్యతకు ప్రతీకగా ఉపయోగించినట్లు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. దీంతో రాఖీ కుటుంబ బంధానికే కాకుండా సామాజిక ఐక్యతకు కూడా ప్రతీకగా నిలిచింది.

**దూరాలను చెరిపేస్తున్న ఆధునిక రాఖీ**

నేటి రోజుల్లో ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాల కారణంగా అన్నాచెల్లెళ్లు వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. అయినప్పటికీ రాఖీ పండుగను మాత్రం మరచిపోవడం లేదు. ఒకప్పుడు సోదరి స్వయంగా ఇంటికి వెళ్లి రాఖీ కట్టేది. ఇప్పుడు దూరంగా ఉన్న సోదరుడికి కొరియర్ ద్వారా రాఖీ పంపుతోంది. వీడియో కాల్ ద్వారా రాఖీ కట్టే దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నారు.

సాంకేతికత పండుగ నిర్వహణ విధానాన్ని మార్చినా.. మనసుల్లోని అనుబంధాన్ని మాత్రం మార్చలేకపోయింది. రాఖీ కట్టే క్షణంలో సోదరి ప్రేమ, సోదరుడి భరోసా స్పష్టంగా కనిపిస్తాయి.

**రక్షణకు కొత్త అర్థం**

ఆధునిక కాలంలో రక్షణ అంటే కేవలం సోదరుడు సోదరిని కాపాడటం మాత్రమే కాదు. ఒకరికి ఒకరు అండగా నిలవడం, కష్టసుఖాలను పంచుకోవడం, పరస్పరం గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు తోడుగా ఉండటమే నిజమైన రక్షణ.

చేతికి కట్టిన రాఖీ కొంతకాలానికి చిరిగిపోవచ్చు.. రంగు వెలిసిపోవచ్చు. కానీ ఆ రాఖీ వెనుక ఉన్న ప్రేమ, నమ్మకం, ఆత్మీయత మాత్రం జీవితాంతం నిలిచే అవకాశం ఉంది. అందుకే రక్షాబంధన్ ఒక పండుగ మాత్రమే కాదు.. కుటుంబ బంధాలను మరింత బలపరిచే భావోద్వేగ వారధి.

రాఖీ చిన్నదే కావచ్చు.. కానీ అది మోసుకొచ్చే బంధం మాత్రం అనంతం.



– మంద వేణు గోపాల్ రెడ్డి
జర్నలిస్ట్



## రజాక్‌పల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు

**నిజాంపేట, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

నిజాంపేట మండలం రజాక్‌పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కనకరాజు ఆధ్వర్యంలో ప్రధాన కూడలి వద్ద రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకరాజు మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు నవీన్, గ్రామస్తులు వజ్జ స్వామి, లింగం, కనకరాజు, శ్రీకాంత్, కుమార్, నారాయణ, మల్లేశం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా లోపంతో కుంగిన బ్రిడ్జి సీసీ రోడ్డు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | ఆగస్టు 27 | ఆశ్వి అప్డేట్స్:**

రేవల్లి-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువపై ఇటీవల నిర్మించిన బ్రిడ్జి సీసీ రోడ్డు ప్రారంభానికి ముందే కుంగిపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో రాకపోకలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మాజీ జడ్పీటీసీ భీమయ్య, మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి ఆరోపించారు. ఈ మార్గం గుండా నిత్యం వ్యవసాయ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, నాగర్‌కర్నూల్ వైపు



వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. భారీ వాహనాలు రోడ్డుపై ఏర్పడిన రంధ్రంలో చిక్కుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డును పరిశీలించి, నాణ్యతతో మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వారు డిమాండ్ చేశారు.

## రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**వికారాబాద్, ఆగస్టు 27 (ఆశ్వి అప్డేట్స్):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. గత కార్యకలాపాలను సమీక్షిస్తూ.. ఇకపై ఎలాంటి నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తనతో జీవించాలని సూచించారు. పెద్దేముల్, మర్పల్లి, నవాబ్‌పేట్, బంట్వారం, దౌల్తాబాద్, కుల్కచర్ల, కోటేపల్లి, తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి వారి ప్రవర్తన, గత కార్యకలాపాలపై పోలీసులు ఆరా తీశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరిస్తూ అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతమైన జీవనం సాగించాలని కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# పోషకాహార గనులు.. ఈ స్మూతీలు!

స్మూతీలు... ఒకప్పుడు జనాలకు ఈ పేరు కూడా తెలీదు.. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా వీటిదే హవా... తయారీలో ఎంత సులభమో అంత రుచికరంగా కూడా ఉంటాయి. అలాగే మనకు అవసరమైన పోషకాలన్నింటిని అందిస్తాయి. కండరాల నిర్మాణానికి బెస్ట్ ఆప్షన్ స్మూతీస్ అని నిపుణులు చెబుతున్నారు. ఇంటెన్సివ్ వర్కవుట్ సెషన్ తర్వాత, సాధారణంగా కండరాల పునరుద్ధరణ కోసం అధిక-ప్రోటీన్ షేక్‌ని తాగుతారు. పీనట్ బటర్, చాక్లెట్-ఫ్లేవర్డ్ ప్రోటీన్ పౌడర్ వంటి అనేక పదార్థాలను కలుపుకుంటారు. అయితే వీటి స్థానంలో ఈ అధిక-ప్రోటీన్ల కోసం కండరాలను పెంచే స్మూతీస్ తాగితే ఎంతో మంచిది.

### శరీరానికి అవసరమైన పోషకాలు....

కండరాల నిర్మాణానికి స్మూతీలు ఎంతో కీలకం. వీటిలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాల మిశ్రమం కలిగి ఉంటాయి. మన శరీరానికి కావాల్సిన పోషకాలను వేగంగా, సులభంగా అందిస్తాయి. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్ పౌడర్, ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి పదార్థాలతో కలిపి, స్మూతీస్ సులభంగా జీర్ణమయ్యే పోషకాహారాన్ని అందిస్తాయి. ఇది కండరాల పెరుగుదల, మరమ్మత్తుకు తోడ్పడడంలో కీలకంగా వ్యవహరిస్తుంది.



### రకారకాలుగా చేసుకోవచ్చు...

స్మూతీలను ఇలా అలా అని కాకుండా మనకు నచ్చినట్టు చేసుకోవచ్చు. మీకు ఎక్కడో చూసిన రెసిపీ నచ్చకపోయినా, మీ రుచి, ప్రాధాన్యతల ప్రకారం మీరు పదార్థాలను సర్దుబాటు చేయవచ్చు. మన ఆహార అవసరాలను, రుచి ప్రాధాన్యతలకు అనుగుణంగా నచ్చినట్టు మార్చుకోవచ్చు.

### మిమ్మల్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి...

స్మూతీలు మిమ్మల్ని రోజంతా హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడతాయి. ముఖ్యంగా కొబ్బరి నీరు, నీరు లేదా బాదం పాలు వంటి పదార్థాలతో తయారు చేసినప్పుడు కండరాల పని తీరు, పునరుద్ధరణ ఎంతో మార్పు చెందుతుంది. తరచూ ప్రయాణాలు చేసే వారు చిటికెలో స్మూతీలు చేసుకొని ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవచ్చు. దీంతో పోషకాహారం ప్రమాణాల గురించి చింతించకుండా వ్యాయామాలను హ్యాపీగా కొనసాగించవచ్చు.

మన శరీరంలో పోషకాలను సమపాళ్లలో అందిస్తూ, అందం, ఆరోగ్యంలో ఎంతో కీలకంగా వ్యవహరించే.. ఫాస్ట్‌గా తయారు చేసుకునే కొన్ని స్మూతీల రెసిపీలు చూసేద్దామా...

### ప్రోటీన్ పవర్‌హౌస్ స్మూతీ

**కావలసినవి:**

* ఒక స్పూన్ వే ప్రోటీన్ పౌడర్
* ఒక మీడియం అరటిపండు
* అర కప్పు యోగర్ట్
* ఒక టేబుల్ స్పూన్ బాదం వెన్న
* ఒక కప్పు బచ్చలికూర
* ఒక కప్పు బాదం పాలు

ఇవన్నీ మిక్స్ చేసి స్మూత్‌గా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి



### పైనాపిల్ కొబ్బరితో బలం

**కావలసినవి:**

* ఒకటిన్నర కప్పులు పైనాపిల్ ముక్కలు
* నాలుగు ఐస్ క్యూబ్‌లు
* అర కప్పు తాజాగా పిండిన నారింజ రసం
* పావు కప్పు కొబ్బరి పాలు
* పావు కప్పు దానిమ్మ రసం
* రెండు స్పూన్ల వెనీలా వే ప్రోటీన్ పౌడర్

అన్ని పదార్థాలను బ్లెండర్లో ఉంచి స్మూత్‌గా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి



### బెర్రీ బ్లాస్ట్ కండరాల బిల్డర్

**కావలసినవి:**

* అర కప్పు మిక్స్డ్ బెర్రీలు (స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, రాస్ప్బెర్రీస్)
* ఒక స్పూన్ వెనీలా ప్రోటీన్ పౌడర్
* పావు కప్పు ఓట్స్
* ఒక టేబుల్ స్పూన్ చియా సీడ్స్
* ఒక కప్పు బచ్చలికూర
* ఒక కప్పు బాదం పాలు

ఇవన్నీ మిక్స్ చేసి స్మూత్‌గా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి



### పీనట్ బటర్ కండరాల ఇంధనం

**కావలసినవి:**

* ఒక స్పూన్ చాక్లెట్ ప్రోటీన్ పౌడర్
* ఒక మీడియం అరటిపండు
* ఒక టేబుల్ స్పూన్ పీనట్ బటర్
* ఒక కప్పు బచ్చలికూర
* ఒక కప్పు బాదం పాలు

ఇవన్నీ మిక్స్ చేసి స్మూత్‌గా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి



### పీనట్ బటర్ బనానా ప్రొటీన్ స్మూతీ

**కావలసినవి:**

* ఒక అరటిపండు
* రెండు టేబుల్ స్పూన్ల వేరుశెనగ వెన్న
* ఒక స్పూన్ ప్రోటీన్ పౌడర్
* ఒక టేబుల్ స్పూన్ అవిసె గింజలు
* ఒక కప్పు కొబ్బరి పాలు

అన్ని పదార్థాలను బ్లెండర్లో ఉంచి స్మూత్‌గా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి




# వానల్లో కలర్‌ఫుల్‌గా మెరిసిపోదామా!

బయట చూస్తే జోరు వర్షా లు.. అడుగు బయట పెడదామంటే వర్షా నికి చిరాకు రావడం గ్యారంటీ. అలాగని వెచ్చగా ఇంట్లో దుప్పటి కప్పుకొని పడుకుందామంటే కుదురుతుందా? చదువులు.. ఉద్యోగాలు సాగేదెలా? ఇక చేసేదేం లేక ఏ రెయిన్ కోటో, గొడుగో తగిలించుకొని బయటకు వెళ్లాల్సిందే... ఈ క్రమంలో మనం ధరించే దుస్తులు మనకు కంఫర్ట్ గా లేకపోతే కష్టమే మరి. మరి వానా కాలంలో ఎలాంటి దుస్తులు వేసుకుంటే మంచిది... ఏ యాక్సెసిరీస్ సౌకర్యంగా ఉంటాయి... ఓ లుక్కేయండి!



### ముదురు రంగు దుస్తులకే...

వర్షా కాలంలో అందంగా కనిపించాలంటే దుస్తుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇక కాలేజీకి వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగాలుకు వెళ్లే మహిళలకు దీని పట్ల మరింత శ్రద్ధ అవసరం. ఎండల్లో పల్చని రంగులు వాడినా ఇప్పుడు ముదురు రంగులు వాడటమే ఉత్తమం. ఎందుకంటే వాతావరణం డల్‌గా ఉంటుంది కాబట్టి ముదురు రంగు దుస్తులు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. అలాగని మరీ భారీ ముదురు రంగులు వాడకూడదు. తేలికపాటివి అయితేనే మంచిది. ఈ కాలంలో తెలుపు రంగు దుస్తులకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.



### ఇవి బాగుంటాయి!

▲ కాటన్, సింథటిక్ ఫ్యాబ్రిక్ వంటి దుస్తులను వాడటం మంచిది
▲ సాయంకాలం సమయంలో ఫ్రాక్స్, అనార్కలీ సౌకర్యంగా ఉంటాయి
▲ స్కిన్ టైట్, లెగ్గింగ్స్ కూడా బాగుంటాయి
▲ అదే విధంగా చీరలు, చుడిదార్లు ధరించే వారు శాండిల్స్, షూస్ వేసుకుంటే మంచిది
▲ హ్యాండ్ బ్యాగులు చిన్న సైజులో కాకుండా, కాస్త పెద్దవిగా ఉన్నవి అయితే నయం



### జీన్స్‌ను దూరం పెట్టేయండి..

▲ ఈ కాలంలో జీన్స్ జోలికి వెళ్లకూడదు. మరీ ముఖ్యంగా టైట్ జీన్స్ అసలు ధరించొద్దు
▲ వర్షా కాలంలో స్లిప్పర్స్ కంటే షూ వాడటం బెటర్. లేదంటే శాండిల్స్ అయినా ఫరవాలేదు
▲ స్లిప్పర్స్ వేసుకుంటే మాత్రం బట్టలపై బురద మరకలు పడి అసహ్యంగా కనిపిస్తాయి



### ఈ జాగ్రత్తలు తప్పనిసరి...



▲ వర్షా కాలంలో పారదర్శకంగా ఉండే దుస్తులకు దూరంగా ఉండటం బెటర్
▲ బట్టలు పొడిగా ఉంచుకోవాలి. తడి వల్ల బ్యాక్టీరియా చేరి ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి
▲ తెలుపు రంగు బట్టలకు మురికి పట్టిందంటే తొందరగా వదలదు
▲ ఏ చిన్న మరక పడ్డా అల్లంత దూరానికి కూడా కనిపించి అసహ్యంగా వుంటుంది కాబట్టి ముదురు రంగు బట్టలు వాడితే మంచిది
▲ ముసురు తగ్గాక దుప్పట్లు, రగ్గులు, బొంతలు, దిళ్లు, పరుపులు, మందపాటి బట్టలను కాసేపు అలా ఎండలో వేస్తే బాగుంటాయి. వాసన కూడా రాదు.
▲ శరీరం ఎప్పుడూ సాధారణ ఉష్ణోగ్రతలో వుండేలా చూసుకోవాలి
▲ శరీర ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు క్రిములు దాడి చేసే ప్రమాదం ఎక్కువ
▲ వానాకాలంలో బయటికెళ్లేటప్పుడు గొడుగు/రెయిన్‌కోట్ వెంట ఉంచుకోవడం మంచిది
▲ వర్షా కాలంలో మేకప్ ఎంత తగ్గిస్తే అంత నయం

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S